క్లుప్తంగా

పింఛనర్ల సంఘ సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ పింఛనర్ల సంఘ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని భక్త వత్సలనగర్‌లోని పింఛనర్ల సంక్షేమ భవనంలో శుక్రవారం నిర్వహించనున్నామని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయ పన్ను, ఈ–ఫైలింగ్‌పై చర్చించనున్నామని వివరించారు. పింఛనర్లు తదితరులు హాజరుకావాలని కోరారు.

నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగ సందర్భంగా బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో నిర్దేశిత ప్రమాణాలను తప్పక పాటించాలని, లేని పక్షంలో దుకాణాలను మూసేయిస్తామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ స్పష్టం చేశారు. దర్గా ప్రాంగణంలోని వివిధ ఆహార స్టాళ్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలను పాటించని నాలుగు ఆహారశాలలను మూయించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించామని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జేసీ సేదు మాధవన్ ఆదేశించారు. రొట్టెల పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన టాయ్‌లెట్లు, పోలీస్ కంట్రోల్ రూమ్ తదితరాలను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. దర్గా ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, సిటీ ప్లానర్ దేవీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మైపాడు తీరంలో పర్యాటకుల కోలాహలం



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు బీచ్‌లో బుధవారం పర్యాటకుల కోలాహలం నెలకొంది. నెల్లూరులో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న రొట్టెల పండగకు తరలి వచ్చిన భక్తులు మైపాడు బీచ్‌కు చేరుకుని సముద్ర స్నానాలు ఆచరించి సేదతీరుతున్నారు. ఈ నేపథ్యంలో తీరంలో సందడి నెలకొంది. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గజ ఈతగాళ్లను ఉంచారు. భక్తులు సముద్రంలో మరింత లోతుగా వెళ్లకుండా జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఎంపీడీఓ సాయిలహరి మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు బీచ్ వద్ద పర్యాటకుల కోసం తగిన ఏర్పాట్లు చేయించామని తెలిపారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

కోవూరు : కోవూరులోని స్టౌ బీడీ కాలనీలో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ మాట్లాడుతూ ఎరుకల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎరుకల కుటుంబాలకు అన్నిరకాల సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏకలవ్యుని చరిత్రను ఆదర్శంగా తీసుకుని నీతి, నిజాయతీతో ఎదగాలని ఆదివాసులకు విజ్ఞప్తి చేశారు. తొలుత ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కట్టా చిరంజీవి, వెంకటేష్, సుబ్బరాయుడు, మస్తానయ్య, మల్లికార్జున, నరసయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

తోటపల్లిగూడూరు : కృష్ణపట్నం పోర్టులో డ్రైవర్లపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆటో కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ నాయకులు పోర్టు కార్మికులపై దాడులను ఖండిస్తూ బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ పోర్టులో పనిచేసే ట్రక్కు డ్రైవర్లతో 12 గంటల పాటు నిరంతరం పనిచేయిస్తూ కేవలం రూ.14 వేలు వేతనం ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఇతర రాష్ట్రాల వారిని ఏమి చేసినా అడిగే వారు ఉండరని పోర్టు యాజమాన్యం దాడులకు దిగడం అన్యాయమన్నారు. ఇటీవల పోర్టులో పలువురు కార్మికులపై దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోర్టులో పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు నాశిన పరుశురాం, గోపి, చిన్నారావు, వెంకట శేషయ్య, రమణయ్యబాబు, వెంకయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం

- మండలంలో పండ్లు, పూల తోటల పెంపకానికి ప్రోత్సాహం
- 2024–25 ఆర్థిక సంవత్సరంలో 250 ఎకరాల్లో సాగు లక్ష్యం
- ఇప్పటి వరకు 56 ఎకరాల్లో పండ్ల తోటల సాగు
- మరో 30 ఎకరాలకు రైతుల వివరాలు నమోదు
- నెలాఖరు వరకు దరఖాస్తునకు అవకాశం



వీర్నకొల్లులో నిమ్మ మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలు

కలిగిరి: గ్రామీణులకు ఉపాధి కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ పథకం కింద చెరువులు, కాలువల వంటి అభివృద్ధి పనులను చేపట్టడం ద్వారా కూలీలకు సొంత ఊర్లలోనే జీవనోపాధి కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి కింద రైతులకు చేయూతనిస్తున్నారు. ఉద్యాన పంటలైన పండ్లు, పూలతోటలు సాగుచేసే రైతులకు సాయాన్ని అందిస్తున్నారు. తద్వార ఉద్యాన పంటల సాగును పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఉపాధి కింద పండ్ల తోటల పెంపకానికి మూడేళ్లు, పూల తోటల పెంపకానికి రెండేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను రైతులకు అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మండలంలోని పలువురు రైతులు పండ్ల తోటల సాగు చేపడుతున్నారు.

లక్ష్యం ఇదీ..

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో 250 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 56 ఎకరాల్లో పలు రకాల పండ్ల మొక్కలు నాటడం జరిగింది. మరో 30 ఎకరాలకు సంబంధించి రైతుల వివరాలు నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులు ఈ నెల 31వ తేదీలోగా మండల కేంద్రంలోని డ్వామా ఏపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉపాధి పథకం కింద ఉద్యాన పంటల సాగుకు సాయం పొందేందుకు సన్న, చిన్నకారు రైతులు మాత్రమే అర్హులు. బీసీలు అయితే ఐదెకరాల్లోపు మెట్ట భూమి కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలు అయితే 10 ఎకరాల్లోపు మెట్ట భూమి కలిగి ఉండాలి. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, 1బీ, బ్యాంక్ పాసుపుస్తకం, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు పత్రాలతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

12 రకాల పండ్ల తోటల పెంపకం

ఉపాధి హామీ పథకం కింద నేల స్వభావం ఆధారంగా 12 రకాల పండ్ల మొక్కల పెంపకం చేపట్టడం జరుగుతుంది. ఎకరాకు మామిడి 70, జీడిమామిడి 70, బత్తాయి 100, నిమ్మ 110, జామ 110, తైవాన్ జామ 440, నారింజ 100, సపోట 60, సీతాఫలం 50, అల్లనేరుడు 60, చింత 40, కొబ్బరి 60 మొక్కలు అందజేస్తారు. అలాగే పూలతోటలకు సంబంధించి గులాబి 2వేలు, మల్లె 1600 మొక్కలు వంతున పంపిణీ చేస్తారు. పండ్ల తోటలకు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చుల కింద ఎకరాకు రూ. 1.10 లక్షల నుంచి రూ. 1.60 లక్షలు వరకు అందిస్తారు. మొక్క ధర, గుంత తీయడానికి రూ. 96, మొక్క వేయడానికి రూ. 17 వంతున చెల్లిస్తారు. సంరక్షణకు నెలకు రూ. 2200 చొప్పున ఏడాదికి 8 నెలల పాటు అందిస్తారు. ఈ విధంగా రైతులకు మూడేళ్ల పాటు చెల్లిస్తారు. పూల మొక్కలకు సంబంధించి రెండేళ్ల పాటు మాత్రమే అందజేస్తారు.



ఉపాధిహామి పథకం ద్వారా సాగు చేసిన నిమ్మతోట

ఐదెకరాల్లో నిమ్మసాగు చేస్తున్నా



ఉపాధి హామీ పథకం ద్వారా ఐదెకరాల్లో నిమ్మ తోట సాగు చేస్తున్నా. గతేడాది నిమ్మ మొక్కలు నాటాను. మొక్కలకు, నాటినందుకు, నిర్వహణకు నగదు అందజేశారు. ఉద్యాన పంటల సాగుకు ఉపాధి అధికారులు, సిబ్బంది పూర్తి సహకారం అందిస్తున్నారు.

– మార్నేళ్ల తిరుపాలురెడ్డి, చంద్రారెడ్డిపాళెం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 250 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అంతకు మించి కూడా సాగుకు ప్రోత్సాహాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. అర్హత కలిగిన రైతులకు మొక్కలు, నిధులు మంజూరు చేస్తాం. ఇప్పటికే పలు గ్రామాల్లో పండ్ల మొక్కలు నాటుతున్నాం. ఉపాధి సిబ్బంది గ్రామాల్లో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ఉన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసరావు,ఉపాధి ఏపీఓ, కలిగిరి

వేడుకగా తొలి ఏకాదశి



మర్రిపాడు: పంచముఖ శక్తి గణపతిని దర్శించుకుంటున్న భక్తులు

ఆత్మకూరురూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని మండల ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని వైష్ణవ ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాశిలిలోని వరదరాజస్వామి, మహిమలూరులోని వేణుగోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి, మురగళ్లలోని కోదండ రామాలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతీ సమేత పరమేశ్వరాలయం, సంతానలక్ష్మి ఆలయం, గండిపాళెంలోని సిద్దేశ్వరాలయం, కోదండరామస్వామి ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గండిపాళెంలో సిద్దేశ్వరస్వామి చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సీతారామపురం: మండల ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని శివాలయాలు, రామాలయాలు, పాండురంగ విఠలేశ్వర స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దేశ్వరంలోని ఇష్టకామేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు.

మర్రిపాడు: డీసీపల్లిలో కొలువైన పంచముఖ శక్తి గణపతి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



సీతారామపురం: విశేషాలంకారంలో ఇష్టకామేశ్వరీదేవి



ఆత్మకూరురూరల్: మురగళ్లలో విశేషాలంకారంలో కోదండరాముడు

శాకంబరిగా కామాక్షిదేవి



సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

సంగం: ఆషాఢ మాసం సందర్భంగా సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత భక్తులు మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి సారెను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కసుమూరులో భక్తుల సందడి



వెంకటాచలం : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన వెంకటాచలం మండలం కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గాలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండగకు వచ్చిన భక్తులు కసుమూరు దర్గాను దర్శించుకోవడం ఆనవాయితీ. రొట్టెల పండగ బుధవారం ప్రారంభమవడంతో అక్కడకు వచ్చిన భక్తులు కసుమూరుకు చేరుకుని మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో కసుమూరులో భక్తజన కోలాహం నెలకొంది.

ముమ్మరంగా వరినాట్లు



సీతారామపురం: మండలంలోని రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు వాతావరణం చల్లబడడంతో బోర్లు కలిగిన రైతులు ముందస్తుగా నార్లు పోసి సాగుకు ఉపక్రమించారు. వరినారు అదునుకు రావడంతో పొలాలను దమ్ము చేసి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. స్థానిక కూలీలతో పాటు ఇతర గ్రామాలకు చెందిన వలస కూలీలు వరి నాట్లు వేసే పనుల్లో హుషారుగా పాల్గొంటున్నారు.

ఘర్షణలో ముగ్గురికి గాయాలు







ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖాదరున్నీసా, ఖాదర్‌బాషా, ఖాదర్‌మస్తాన్

మర్రిపాడు:మండలంలోని నందవరంలో కుటుంబ సభ్యుల మధ్యన బుధవారం జరిగిన ఘర్షణలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. నందవరం గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌బాషా, నెల్లూరుపాళేనికి చెందిన షమీనాను వివాహం చేసుకున్నారు. రెండేళ్ల క్రితం దంపతుల మధ్యన గొడవలు నెలకొనగా పోలీసులు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. అప్పట్నుంచి ఇరువురు అన్యోన్యంగా ఉంటున్నారు. మొహర్రం సందర్భంగా షమీనా కుటుంబసభ్యులు సోమవారం నందవరం వచ్చారు. బుధవారం షమీనా ముగ్గురు మేనమామలు, మేనత్తలు, ఖాదర్‌బాషా, అతని సోదరుడు ఖాదర్‌మస్తాన్, సోదరి ఖాదరున్నీసా నడుమ చిన్నపాటి వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఖాదర్‌బాషా, ఖాదర్‌మస్తాన్, ఖాదరున్నీసాపై షమీనా మేనమామలు, మేనత్తలు దాడి చేయడంతో వారు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు మర్రిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: జాతీయరహదారి పనులకు సంబంధించి విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్న కారణంగా మండల కేంద్రమైన దుత్తలూరులో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని విద్యుత్ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుత్తలూరు సెంటర్, దుత్తలూరు కాలనీ, బీసీ కాలనీ, కట్టకిందపల్లి ఎస్సీకాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏఎస్‌పేట దర్గాలో ఉచిత వైద్యశిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ మంజుల

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా ప్రాంగణంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల మాట్లాడుతూ నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారని తెలిపారు. అక్కడకు వచ్చిన భక్తులు ఏఎస్‌పేట దర్గాను దర్శించుకునేందుకు వస్తుంటారని, వారి కోసం దర్గా ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆందోళన



బిజ్జంపల్లెలో ఆందోళన చేపడుతున్న వెంకటయ్య, తదితరులు

ఉదయగిరి: మండలంలోని కొండ కింది పల్లెల ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బిజ్జంపల్లెలో కొండ కింద పల్లెల ప్రజలు బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి కొండ కింది గ్రామాలకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. వ్యవసాయ రంగానికి పగటి పూట విద్యుత్ సరఫరాను కొనసాగించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాల దృష్ట్యా పల్లె వెలుగు బస్సులను ఆర్టీసీ అధికారులు నడపాలని కోరారు. విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులకు అనుకూలంగా బస్సులను నడపాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ఆత్మకూరురూరల్: కరటంపాడులో పీర్ల ఊరేగింపు



ఉదయగిరిలో మొహర్రం విశిష్టతను వివరిస్తున్న మతపెద్దలు



సీతారామపురంలో పీర్ల ఊరేగింపు

ఉదయగిరి: పట్టణంలోని ముస్లింలు మొహర్రంను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ఆస్థాన ఖాదరియాలో నిర్వహించిన యౌమే ఆషూర కార్యక్రమంలో ఆస్థాన అధిపతి అహ్మద్‌బాషా మొహర్రం సందేశాన్ని అందజేశారు. మహ్మద్ ప్రవక్త మనమడు హజరత్ ఇమామే హుస్సేన్, అతని పరివారం 72 మంది పవిత్ర మక్కాలోని కర్బలా మైదానంలో అమరులై విశ్వజనుల శాంతియుత సహజీవనానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అందులో భాగంగా మొహర్రం నెల పదోరోజున జరుపుకొనే యౌమే ఆషూరలో అమరవీరులను స్మరించుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ఖురాన్ పఠించి భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు. అలాగే పంచాయతీ బస్టాండ్ సమీపంలోని ఖాన్‌సావలి దర్గా ఆవరణలో యౌమే ఆషూర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని సీతారామపురం, తురకపాలెం, నారాయణప్పపేట, ఎగువపాలెం గ్రామాల్లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. మంగళవారం రాత్రి ఆయా గ్రామాల్లోని పీర్లచావిడిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరిరోజైన బుధవారం ఉదయం, సాయంత్రం వేళల్లో పీర్లను ఊరేగించారు. షహదత్ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన పీర్లు సీతారామపురం మెయిన్‌బజారు సెంటర్‌లో సలాం అందుకున్నాయి. అనంతరం బావి వద్ద పీర్లకు స్నానం ఆచరించి పీర్లచావిడి వద్దకు తరలించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. గ్రామోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై అనూష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఆత్మకూరు: మొహర్రం సందర్భంగా పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి జెండాచెట్టు వద్ద పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, డాక్టర్ జే ప్రణీత్ పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు, మహిమలూరు, బొటికర్లపాడు, అప్పారావుపాళెం, వాశిలి, అశ్వనీపురం, బట్టేపాడు, తదితర గ్రామాల్లో పీర్లను మేళతాళాల మధ్య ఊరేగించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

అనుమసముద్రంపేట: చిరమనలో పీర్లను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని ముస్లిం యువకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.